PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :158 | పేజీలు : 8 | వెల రూ.5 | బుధవారం. 24.06.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh








# రెండో మెట్రోకు.. గ్రీన్ సిగ్నల్!

## కేంద్రంతో చర్చలు సక్సెస్

- ఫేజ్-I వాల్యూయేషన్.. ఫేజ్-II విస్తరణకు కన్సల్టెంట్‌గా ఎస్బీఐ క్యాప్స్
- కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ
- సమన్వయ సభ్యులుగా కేంద్ర ప్రభుత్వ అధికారి, రాష్ట్ర ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ
- కేంద్ర మంత్రులు అశ్వినీవైష్ణవ్, ఖట్టర్‌తో సీఎం రేవంత్ చర్చలు సఫలం

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు

హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం..విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి... హైదరాబాద్ మెట్రో ఫేజ్ I స్వాధీనం.. ఫేజ్ II విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం రాత్రి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మంగళవారం ఉదయం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ I వాల్యూయేషన్... ఫేజ్ I స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ.. రుణ సంస్థ ఎంపిక... మెట్రో ఫేజ్ II విస్తరణ.. నిర్మాణ వ్యయం... అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ఎస్బీఐ క్యాప్స్ ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్ I వాల్యూయేషన్... ఫేజ్ II విస్తరణ ...ఇతర అంశాలపై ఎస్బీఐ క్యాప్స్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు.

# అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై మంత్రి సీతక్క సమీక్ష



హైదరాబాద్, జూన్ 23 ప్రభాత సూర్యుడు: గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని సీతక్క ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్‌తో చర్చించారు. మహిళల జీవనోపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి పథకం అమలు కావాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అలాగే, గ్రామ స్థాయిలో భూగర్భ జలాలు పెంచే విధంగా 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

# గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోండి..

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు తుమ్మల విజ్ఞప్తి



న్యూఢిల్లీ, జూన్ 23 ప్రభాత సూర్యుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# కొత్త పథకానికి పేరు సూచించండి..

## రూ. లక్ష బహుమతి గెలుచుకోండి





హైదరాబాద్,ప్రభాత సూర్యుడు నగరంలో క్యూర్ (ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం) పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ కొత్త పథకానికి పేరు సూచించాలంటూ బోర్డు కోరుతోంది. మంచి పేరు సూచించిన వారికి రూ.1 లక్ష బహుమతి అందజేస్తామని ప్రకటించింది. ఈ పథకానికి ప్రజల నుంచే పేరు తీసుకోవాలని బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈ నెల 28 వరకూ సోషల్ మీడియా వేదికగా పోటీ నిర్వహించనున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎంట్రీలకు అవకాశం కల్పిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. ఆసక్తి ఉన్న వారు లక్ష ఇళ్ల పథకానికి మంచి పేరు సూచించి బహుమతిని సొంతం చేసుకోండి మరి.

సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనతో లక్ష ఇళ్ల ప్రాజెక్ట్..

క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫ్లాట్ల నిర్మాణం జరుగుతోంది.

# పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోం..

## రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ధ్వజం



ఖమ్మం జిల్లా, జూన్ 23 ప్రభాత సూర్యుడు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ఇందిరమ్మ రాజ్యమంటూనే పేదల ఇళ్లు కూలగొడుతోందని మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైనా పేదలకు అండగా నిలిచి వాళ్లకు గూడు కట్టిస్తుందని తెలిపారు. రెవెన్యూ మంత్రి హయాంలో పేదల ఇళ్లు లాక్కోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో హరీశ్‌రావు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మం కలెక్టర్‌తో మాట్లాడి పేదల గూడు లాకుంటే ఊరుకోమని చెప్పామని అన్నారు. ఎవరి స్థలాలు అయితే లాక్కున్నారో.. వారికి వెంటనే స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు.

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి..**

ఖమ్మంలో జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే తానే పోరాడుతానని స్పష్టం చేశారు. తాను దగ్గరుండి ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని భరోసా కల్పించారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారని అన్నారు. మరి ఖమ్మం జర్నలిస్టులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఖమ్మం జర్నలిస్టులకు ఎందుకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదని నిలదీశారు.

**రేవంత్‌రెడ్డి పాలనంత బ్లాక్‌మెయిల్..**

ఖమ్మంలో పేదల ఇళ్లు లాక్కుంటే చూస్తూ ఊరుకోమని.. ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు.


# పద్మ అవార్డుల ప్రధానోత్సవం 2026




న్యూఢిల్లీ, ప్రభాత సూర్యుడుండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరుగుతోంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేస్తున్నారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను అందుకుంటున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు.

# డీసిల్టేషన్ పేరుతో ఇసుక అక్రమాలు

## బరాజ్ లేకుండా డీసిల్టేషన్ 15 రోజుల్లో అనుమతులు ఎలా
## ఇసుక వ్యవహారంపై, ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి, మాజీ రెడ్కో చైర్మన్, సోషల్ మీడియా కన్వీనర్ వై సతీష్ రెడ్డి, సంచలన వ్యాఖ్యలు






ములుగు జూన్ 23,(ప్రభాత సూర్యుడు) ములుగు జిల్లాలో గత కొద్ది రోజులుగా అధికార పార్టీ నాయకులు చేస్తున్న ఇసుక దందా పై మంగళవారం రోజు రోజున ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తో సమావేశమైన బిఆర్ఎస్ నాయకులు సమావేశం అనంతరం బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి, మాజీ రెడ్కో చైర్మన్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్, మాజీ వై సతీష్ రెడ్డి, మీడియాతో మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న ఇసుక తవ్వకాల వ్యవహారం పై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ, ఇది కుంభకోణమా కాదా అన్నది ప్రజలే తేల్చాలని విజ్ఞప్తి చేశారు. మీడియా ప్రతినిధులు కూడా ఈ అంశాన్ని పరిశీలించి ప్రజలకు నిజాలను తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసిల్టేషన్ అనే ప్రక్రియను తప్పుగా చూపిస్తూ అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి అని ఆరోపించారు. సాధారణంగా డీసిల్టేషన్ అనేది బరాజ్‌లు లేదా చెక్‌డ్యామ్‌ల వద్ద నీటి నిల్వ సామర్థ్యం తగ్గినప్పుడు పేరుకుపోయిన ఇసుకను తొలగించేందుకు మాత్రమే చేపట్టాల్సిన ప్రక్రియ అని అయితే సీతమ్మ సాగర్ బ్యారేజ్ కు దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో మంగపేట ప్రాంతంలో బరాజ్ లేకపోయినా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం అనుమానాస్పదమని అన్నారు. బరాజ్ లేకుండా డీసిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలు చేయడం ఎలా సమంజసం అని ప్రశ్నించారు. ఇక జిల్లాలో ఇప్పటికే ఉన్న 50 నుంచి 100 వరకు ప్రైవేట్ ఇసుక క్వారీలను నిలిపివేయడం వెనుక కూడా కుట్ర ఉందని ఆరోపించారు. ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి, కొంతమంది లాభపడేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ క్వారీల్లో పెట్టుబడులు పెట్టిన స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనుమతుల మంజూరులో జరిగిన వేగంపై కూడా వారు అనుమానాలు వ్యక్తం చేశారు. సాధారణంగా ఇలాంటి అనుమతులకు సంవత్సరాల సమయం పట్టే పరిస్థితిలో, కేవలం 15 రోజుల్లోనే అన్ని అనుమతులు రావడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. మంత్రుల ప్రమేయం లేకుండా ఇంత వేగంగా అనుమతులు రావడం సాధ్యమేనా అని ప్రశ్నించారు.

మార్చి 25న చీఫ్ ఇంజనీర్ లేఖతో ప్రారంభమైన ప్రక్రియ, ఏప్రిల్‌లో వివిధ శాఖల నుంచి వరుసగా లేఖలు, జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ, జిల్లా స్థాయి సాండ్ కమిటీ (డీఎల్‌ఎస్సీ) సమావేశం, గ్రామ సభల ఆమోదం తెలపడం వరకు ఈ ప్రక్రియలు అత్యంత వేగంగా పూర్తయ్యాయని ఆయన పేర్కొన్నారు. రెండు సంవత్సరాలుగా డీఎల్‌ఎస్సీ సమావేశాలు జరగకపోయినా అకస్మాత్తుగా మూడు రోజుల్లోనే సమావేశం జరిపి ఆమోదాలు ఇవ్వడం అనుమానాస్పదమని అన్నారు. పీసా చట్టం ప్రకారం గ్రామ సభల ఆమోదం తప్పనిసరి అయినప్పటికీ, నోటీసు ఇచ్చిన వెంటనే మూడు రోజుల్లోనే గ్రామ సభలు నిర్వహించి నివేదికలు సమర్పించడం కూడా ప్రశ్నార్థకమని విమర్శించారు. ఈ మొత్తం వ్యవహారం సుమారు రూ. 4000 కోట్ల కుంభకోణంగా అభివర్ణించిన సతీష్ రెడ్డి ఈ మొత్తం డబ్బును ములుగు నియోజకవర్గంలోని కుటుంబాలకు పంచితే ప్రతి కుటుంబానికి రూ. 4 లక్షలు అందించవచ్చు అని అన్నారు. ప్రజల సొమ్మును దోచుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తూ, ప్రభుత్వం దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరగా తాము వ్యక్తిగత విమర్శలు చేయడం కాదని, ప్రజల తరఫున ప్రశ్నిస్తున్నామని పేర్కొంటూ ఈ అంశంపై ప్రజలు స్పందించాలని, నిజానిజాలు బయటపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సనికొమ్ము రమేష్ రెడ్డి, లింగాల రమణారెడ్డి జిల్లా నాయకులు వేములపల్లి బిక్షపతి, జగదీష్, మాజీ జడ్పీటీసీ లు మల్కా రమేష్ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎంపీపీలు భూక్యా మురళి కోనేరు నాగేష్ ,ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్లు బైకని అనూష, సాగర్, కోగిల లక్ష్మీ ,మాజీ ఎంపీటీసీలు గొర్రె సమ్మయ్య ,మదారి రామయ్య ,మహేష్ మసిపెద్ది సత్యనారాయణ ,మాజీ సర్పంచులు గండి కుమార్ రాజన్న చందా కుమారస్వామి ,సర్పంచులు అమర్ సింగ్ నిరోష దాసరి సరిత, రమేష్ ఉపసర్పంచ్ అన్న తిరుపతి ముఖ్య నాయకులు అకుతోట చంద్రమౌళి కోగిల మహేష్, చంటి భద్రయ్య ముంజల బిక్షపతి, ఉయ్యాల భద్రయ్య గరిగా రఘు దుడబోయిన శ్రీనివాస్ యాదవ్, మెరుగు సంతోష్ వాంకుడోత్ రాందాస్ రానా ప్రతాప్ అంకుస్, బిఆర్ఎస్వి జిల్లా నాయకులు కొమరం సిద్ధు, మహిళా నాయకురాలు ఈశ్వరి శేఖర్ కార్తీక్ రాందాస్ బాలు నాయక్ చంటి నాజర్ ఖాన్ మహేందర్ శ్రీనివాస్ ,రంజిత్ సాంబయ్య సాయి తదితరులు పాల్గొన్నారు

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం...

**– యువత మత్తు పదార్థాలను విడనాడాలి...**
**– చర్ల సీఐ ఏ రాజువర్మ.**
**–సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి... ఆర్ జాన్ .**

చర్ల జూన్ 23 (ప్రభాత సూర్యుడు)యువత మత్తు పదార్థాలను విడనాడి, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకునేందుకు కృషి చేయాలని చర్ల సీఐ ఏ రాజు వర్మ , చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్ జాన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఈగల్ ఫోర్స్ తెలంగాణ శాఖ పిలుపుమేరకు చర్ల పోలీస్ శాఖ సీఐ ఏ రాజువర్మ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ లో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చర్ల సీఐ ఏ రాజు వర్మ , ప్రభుత్వ వైద్యాధికారి ఆర్ జాన్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఆర్ నర్సిరెడ్డి , పీ కేశవ్ , చర్ల గణేష్ ఆటో యూనియన్ అధ్యక్షులు పామర్రు బాలాజీ , పలువురు ఆటో యూనియన్ నాయకులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# బూత్ లెవల్ ఏజెంట్లు, అధికారులకు ఎస్ఐఆర్ అవగాహన సదస్సు



బడంగ్‌పేట్, జూన్ 23 (ప్రభాత సూర్యుడు):ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి సర్వేకు సంబంధించి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏలు) మంగళవారం బడంగ్‌పేట్ సర్కిల్–16 కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రజాభవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా మ్యాపింగ్, ప్రోజెనీ మ్యాపింగ్, ఇంటింటి సర్వే, అర్హులైన ఓటర్ల గుర్తింపు, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన, వలస వెళ్లిన మరియు డూప్లికేట్ ఓటర్ల వివరాల పరిశీలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్‌వో వి. సమ్మయ్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఓటర్ల ముసాయిదా జాబితా తయారీ, ఫారం–6, 7, 8 దరఖాస్తుల సేకరణ, మరణించిన మరియు వలస వెళ్లిన ఓటర్ల గుర్తింపులో బీఎల్ఏలు, బీఎల్ఓలకు సహకరించాలని కోరారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో బీఎల్ఏల పాత్ర కీలకమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్ ప్రతాప్ రెడ్డి, బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే అక్రమ నిర్మాణం !

**– భారీ షెడ్ నిర్మాణంపై స్థానికుల ఆగ్రహం**
**– ఫంక్షన్ హాల్ పన్ను వ్యవహారంపై కూడా అనుమానాలు**



పెద్ద అంబర్‌పేట్, జూన్ 23 (ప్రభాత సూర్యుడు):మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కళ్ళెం బాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ ఆవరణలో మున్సిపల్ అనుమతులు లేకుండానే భారీ షెడ్ నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రత్యేకంగా ఈ నిర్మాణం నాగోల్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే జరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులకు కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సంబంధిత ఫంక్షన్ హాల్ ప్రాపర్టీ ట్యాక్స్ వ్యవహారంలో కూడా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసెస్‌మెంట్ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించబడిందని, ఫలితంగా మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోందని స్థానిక నాయకులు పేర్కొంటున్నారు. ఫంక్షన్ హాల్‌కు తక్షణమే రీ–అసెస్‌మెంట్ నిర్వహించి వాస్తవ పన్ను బకాయిలను నిర్ధారించాలని,


అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ ఆదాయాన్ని కాపాడటంతో పాటు అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# ప్రతి ఓటును కాపాడుకోవాలి మంత్రి దామోదర



జూన్ 23 (ప్రభాత సూర్యుడు) నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ప్రతి ఓటును కాపాడుకోవాలని రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం నాడు అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులు, న్యాయవాదుల సహకారం తీసుకొని బిఎల్ఓలను చైతన్యవంతం చేయాలని అన్నారు. వలస ఓట్లను కూడా కాపాడుకునేల కార్యకర్తలు చూడాలని పేర్కొన్నారు.

# సంగారెడ్డి: ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యచరణ ప్రణాళిక రూపొందించాలి




జూన్ 23 (ప్రభాత సూర్యుడు) ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక వినతులను విశ్లేషించి జిల్లా స్థాయిలో కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రత్యేక అధికారిని డాక్టర్ క్రిస్టిన జడ్చోంగ్ అధికారులను ఆదేశించారు! మంగళవారం నాడు కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ ధర్నాతో ఉలిక్కిపడ్డ కాంగ్రెస్ ?

**– లష్కర్‌గూడ బ్రిడ్జి నిర్మాణ అంశంపై హుటాహుటిన ప్రెస్‌మీట్**
**– మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆందోళనకు కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ నేతలు**
**– అభివృద్ధిపై విమర్శలు ఖండించిన మండల కాంగ్రెస్ నాయకులు**



అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 23 (ప్రభాత సూర్యుడు)లష్కర్‌గూడ బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ధర్నా రాజకీయంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనకు స్పందనగానే కాంగ్రెస్ ఈ సమావేశం ఏర్పాటు చేసిందనే చర్చ స్థానికంగా సాగుతోంది. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ అధ్యక్షుడు సిహెచ్ భాస్కర్ చారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పాల్గొని బీఆర్ఎస్ నేతల విమర్శలను ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే లష్కర్‌గూడ బ్రిడ్జి అంశాన్ని తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పలు సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. కోహెడలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, నియోజకవర్గంలో చేపడుతున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను కాంగ్రెస్ నేతలు ప్రస్తావించారు. అనంతరం భాస్కర్ చారి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషితో నియోజకవర్గంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశానికి పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, లష్కర్‌గూడ బ్రిడ్జి అంశంపై బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళన తర్వాతే కాంగ్రెస్ నేతలు మీడియా ముందుకు రావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దా

# రఘునాధపాలెం గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

**కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కోరిన మంత్రి తుమ్మల.**

ఖమ్మం, జూన్ 23 నిర్భయవార్త రిపోర్టర్.ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని రఘునాధపాలెం మండలంలో ఏజెన్సీ, గిరిజన గ్రామ పంచాయతీలకు వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. సోమవారం రాసిన ఈ లేఖలో మండలంలోని డ్రైనేజీ సమస్యలను మంత్రి వివరించారు.మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 28 ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. వర్షాకాలంలో సరైన వరద నీటి కాలువలు లేక ఈ గ్రామాలు తీవ్ర నీటి నిల్వ, పారిశుధ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయని, గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు రూ.110 కోట్లు అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తన నియోజకవర్గ పరిధిలోని ఈ గిరిజన ప్రాంతాలకు సరిపడా స్థానిక వనరులు లేనందున, గ్రామీణాభివృద్ధి లేదా గిరిజన ప్రాంత అభివృద్ధి పథకాల ద్వారా నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు.ప్రతిపాదిత పనులు ఈ గిరిజన ప్రాంతాల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యం, జీవన పరిస్థితులు, మొత్తం మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరుస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. డీపీఆర్‌తో పాటు గ్రామ పంచాయతీల జాబితాను లేఖకు జతచేస్తూ, నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించాలని కేంద్ర మంత్రిని ఆయన అభ్యర్థించారు.

# తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్

**పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన**



కీసర, జూన్ 23 (ప్రభాత సూర్యుడు) భూభారతి, రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులైన దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కీసర తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి కార్యక్రమం, రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల స్థితిగతులు, వాటి పరిష్కార ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డికి సూచించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులు, పరిపాలనా నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలపై అదనపు కలెక్టర్ సాధారణ తనిఖీ నిర్వహించారు. కార్యాలయ పనితీరు మరింత మెరుగుపడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# రైతు వేదికల్లో విత్తన మేళా అవగాహన సదస్సులు.





సింగరేణి జూన్ 23 (ప్రభాత సూర్యుడు).సింగరేణి మండలంలోని అన్ని రైతు వేదికల వద్ద మంగళవారం రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విత్తన మేళా, అవగాహన సదస్సుల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఆధునిక సాగు పద్ధతులు,ఎరువుల వినియోగంపై విస్తృతంగా అవ గాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారు లు,వి త్తనాలు,ఎరువులు,పురుగుమందుల డీలర్లు రైతులకు నానో యూరియా,నానో డీఏపీ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే వివిధ రకాల పప్పుధాన్యాలు,నూనెగింజ పంటలు,కూరగాయల విత్తనాలు,ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శిస్తూ వాటి సాగు విధానాలను తెలియజేశారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న రకాల వరి విత్తనాలను రైతులకు చూపించి,బోనస్‌కు అర్హత కలిగిన వరి రకాలపై అవగాహన కల్పించారు. ఒకే రకమైన పంటల సాగుకు పరిమితం కాకుండా పప్పుధాన్యాలు,నూనెగింజల పంటలను సాగు చేయాలని సూచించారు. పంట మార్పిడి విధానం వల్ల భూసారం పెరగడం,తెగుళ్ల తగ్గడం,దిగుబడులు మెరుగుపడడం వంటి ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా పంట కోత అనంతరం వచ్చే పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని,దీనివల్ల భూసారం పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని రైతులకు సూచించారు. మండలంలోని రైతులకు రైతు వేదికల వద్దే నాణ్యమైన విత్తనాలు,పప్పుధాన్యాల విత్తనాలు,ఆధునిక ఎరువుల వినియోగంపై పూర్తి సమాచారం అందించడంతో పాటు వ్యవసాయ రంగంలో కొత్త సాంకేతికతలను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల వ్యవసాయ అధికారి బట్టు అశోక్ కుమార్, సొసైటీ డైరెక్టర్ ఐలయ్య,ఆయా గ్రామాల సర్పంచులు,ఉ పసర్పంచులు,వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు)మున్నీ,నరేష్,మహేష్,చంద్రకళ,ఆయా గ్రామపంచాయతీ సెక్రటరీలు,విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# 1/70 చట్టం కాలగర్భంలో కలవాల్సిందేనా..?

**ప్రభుత్వం చెప్పేదొకటి.. ఆచరణలో పెట్టేదొకటి!**

**గిరిజన భూములు గిరిజనులకే చెందాలి: హైకోర్టు అడ్వకేట్ సునీల్ కుమార్**

**ఆక్రమణలపై దమ్మపేట, అశ్వారావుపేట గిరిజన నేతల ఆందోళన**




దమ్మపేట (ప్రభాత సూర్యుడు)గిరిజన ప్రాంతాల రక్షణకు ఉద్దేశించిన 1/70 చట్టం ఉనికికే ముప్పు వాటిల్లుతోందా? గిరిజనుల భూములను కాపాడటంలో పాలకులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది గిరిజన సంఘాల నుంచి. ఏజెన్సీ ప్రాంతాల్లోని భూ సమస్యలు, చట్టాలపై భద్రాచలంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. గిరిజనులను చైతన్యపరిచేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హైకోర్టు అడ్వకేట్, తెలంగాణ రాష్ట్ర భూభారతి సలహాదారు భూమి సునీల్ కుమార్ హాజరయ్యారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ చట్టాల ప్రకారం గిరిజన భూములు గిరిజనులకే చెందాలని స్పష్టం చేశారు. నాన్–ట్రైబల్స్ (గిరిజనేతరులు) ఎట్టి పరిస్థితుల ల్లోనూ ఆ భూములపై హక్కుదారులు కాలేరని తేల్చి చెప్పారు. భూభారతి చట్టం, ఏజెన్సీ కోర్టుల పనితీరును వివరిస్తూ, స్థానికులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన చట్టపరమైన పరిష్కారాలను చూపిస్తూ భరోసా కల్పించారు. వేల ఎకరాలు పరాయిపాలు.?ఈ సదస్సులో వ్యక్తమైన అభిప్రాయాలపై దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు చెందిన గిరిజన నేతలు హర్షం వ్యక్తం చేశారు. అడవినే నమ్ముకుని జీవిస్తున్న తమకు సునీల్ కుమార్ ఇచ్చిన భరోసా ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక భూ ఆక్రమణలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.




దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో గిరిజనులకు చెందిన వేలాది ఎకరాల భూములు నాన్–ట్రైబల్స్ చేతుల్లోకి వెళ్ళిపోయావని, ఫలితంగా స్థానిక గిరిజనుల జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల కుట్రలను తిప్పికొడతాం.?ఒక వైపు గిరిజన భూములను అక్రమంగా ఆక్రమించుకోవడమే కాకుండా, మరోవైపు గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు తెరవెనుక కుట్రలు పన్నుతున్నారని గిరిజన నాయకులు మండిపడ్డారు. "నమ్మి ఓట్లు వేస్తే మాపై ఇంత కక్ష ఎందుకు? గిరిజనులకు అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులే నాన్–ట్రైబల్స్‌కు కొమ్ముకాస్తుండటం దుర్మార్గం" అని ధ్వజమెత్తారు. ప్రభుత్వం మాటల్లో గిరిజన ప్రేమికుడిగా నటిస్తూ, చేతల్లో మాత్రం గిరిజనేతరులకు సహకరిస్తోందని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు అన్యాయం జరగకుండా, వారి భూ హక్కుల రక్షణ కోసం గిరిజన నేతలుగా ఎల్లప్పుడూ అండగా ఉండి పోరాడుతామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తాటి పోతురాజు, వాసం వెంకటేశ్వరరావు, గడ్డం వెంకటేశ్వరరావు, కోరం ప్రసాద్, కోర్స వెంకటేశ్వరరావు, రావుల శోభనబాబు, వాసం రాజేష్, సోయం ఉమామహేశ్వర రావు, మంగారావు, రావుల అప్పారావు, మారుతి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి నివేదిక కార్యక్రమ విజయాలను కేస్ స్టడీలుగా నమోదు చేయాలి... జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం, జూన్– 23 (ప్రభాత సూర్యుడు)99 రోజుల ప్రజాపాలన––ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను కేస్ స్టడీల రూపంలో నమోదు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి, గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో 99 రోజుల ప్రజాపాలన––ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి, జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమం విజయగాథలను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి శాఖ తమ విజయాలు, సాధించిన ఫలితాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సంక్షిప్తంగా పొందుపరుస్తూ నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి శాఖ నివేదికలో స్పష్టమైన వివరాలు ఉండాలని, ఇతర జిల్లాల్లో అమలు చేయదగిన ఉత్తమ పద్ధతులను ప్రత్యేకంగా పేర్కోవాలని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, వాటి ప్రస్తుత స్థితి, పరిష్కార వివరాలను కూడా నివేదికల్లో పొందుపరచాలని సూచించారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్‌ల సవరణ చర్యల వల్లమరణాల సంఖ్యలో వచ్చిన తగ్గుదలను గత ఏడాది గణాంకాలతో పోల్చి చూపించాలని, ప్రమాదాల తగ్గుదల స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని గురుకుల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకూడదని, నిరుపేదలు, అనాథలు,ఒంటరి తల్లిదండ్రుల పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ ఖాళీ సీట్లను భర్తీ చేయాలని సూచించారు. మంచి విద్య పిల్లలకు జీవితాంతం ఉపయోగపడే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టీజీఎంఐడీసీ, మన ఇసుక వాహనం ద్వారా ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని ఖమ్మం జిల్లాలో ఇసుక సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలో నాణ్యమైన ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.




యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కేటాయింపులు కూడా టీజీఎంఐడీసీ ద్వారా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశానికి అన్ని శాఖలు తమ అవసరమైన ఇసుక ప్రతిపాదనలు పంపాలని సూచించారు. 99 రోజుల ప్రజాపాలన––ప్రగతి ప్రణాళికపై రూపొందించే బుక్‌లెట్‌లో ప్రతి శాఖ విజయ గాథలు, ఉత్తమ కేస్ స్టడీలు, థీమ్ వారీగా ఎంపిక చేసిన ఉత్తమ ఫొటోలను పొందుపరచాలని సూచించారు. బుక్‌లెట్ పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో బుక్‌లెట్ పూర్తి చేయాలని ఆదేశించారు.

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ**

మాతృ మరణాల రేటును సున్నాకు తీసుకురావాలనే లక్ష్యంతో తల్లి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. "ప్రతి ప్రసవం సురక్షితం" కార్యక్రమం ద్వారా హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ తో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

బాలల భద్రత వారోత్సవాలు నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. 53 మంది అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు అందించినట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 610 మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యాకాస రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికైన కొండబోయిన నాగేశ్వరరావు.



సింగరేణి జూన్ 23(ప్రభాత సూర్యుడు)తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా కారేపల్లికి చెందిన కొండబోయిన నాగేశ్వరావు ఎన్నికయ్యారు. వ్యవసాయ కార్మిక సంఘం 4 వ తెలంగాణ రాష్ట్ర మహాసభలు మహబూబ్ నగర్ లో ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు జరిగాయి. ఈ మహాసభలో సంఘం రాష్ట్ర కమిటీ ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా, వైరా డివిజన్ కార్యదర్శిగా పనిచేస్తూ ప్రజా సమస్యల రాజీలేని పోరాటాలు, నిర్వహించిన కొండబోయిన నాగేశ్వరరావు రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ పేదలకు కూలీ, భూమి, పోడు, ఉపాధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్తంగా పోరాటం నిర్వహిస్తుందన్నారు. పోరాటాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ హామీల అమలు లక్ష్యంగా పనిచేస్తూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కొండబోయిన నాగేశ్వరరావు రాష్ట్ర కమిటీ ఎన్నికైన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

# చెత్త, చెదారంతో నిరుపయోగంగా చేతిపంపు బోరు.

**వాడుకలో ఉన్నట్లా? లేనట్లా? లేక పేరుకే నా.**



సింగరేణి/ఖమ్మం జూన్ 23 ప్రభాత సూర్యుడు . సింగరేణి మండల కేంద్రంలో రైల్వే స్టేషన్ మార్గంలో ఓ చేతి పంపు నిర్మానుషంగా మారింది. ఒకవైపు చెత్తా,చెదారంతో మరో ప్రక్క సైడ్ డ్రైనేజ్ మురికి కాలువని అనుకోని ఉండడంతో ఈ పంపు వాడుకలో ఉన్నట్లు? లేక లేనట్లా? కనిపిస్తుందని గ్రామ ప్రజలు అంటున్నారు. ఈ రహదారి గుండా ప్రయాణించే ప్రజలు చేతి పంపు నిర్మానుషంగా మారడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రజలకు వాడుకలోకి ఉండే విధంగా అధికారులు చొరవ చూపడం లేదని వాడుకలో ఉంటే ప్రజలకు అనునిత్యం ఉ పయోగపడుతుందని గ్రామస్తులు కోరారు. బోరు చుట్టు పరిసర ప్రాంతం శుభ్రం చేసి ప్రజల దాహం తీర్చే విధంగా వాడుకోలకు తేవాలని ప్రజలు కోరారు.

# రెండు కాళ్లు కోల్పోయిన ఇడమయ్యకు చేయూత .



చర్ల జూన్ 23 (ప్రభాత సూర్యుడు)చర్ల మండలం అత్యంత మారుమూల బక్క చింతలపాడు గ్రామానికి చెందిన ఇడమయ్య కు రెండు కాళ్లు కోల్పోయి చేతులు సైతం సవ్యంగా పనిచేయక నిస్సహాయక పరిస్థితులు ఉన్న ఆయన దుస్థితిపై పలువురు దాతలు స్పందించారు. హైదరాబాద్ కు చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగిశ్రీ కాముని శివరామకృష్ణ రూ. 10 వేలు, హైకోర్టు న్యాయవాది శ్రీ సిహెచ్ సతీష్ కుమార్ 5000 రూపాయలు, టీవీ9 రిపోర్టర్ శ్రీ అనిల్ రెడ్డి 5000 రూపాయలు, శ్రీ ఎడారి భూపతి 2000 రూపాయలు మొత్తం రూ..22 వేల రూపాయలు నగదును మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుల చీమలమర్రి మురళి కృష్ణ చేతుల మీదుగా ఇడమయ్య, సుశీల దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతల దాతృత్వాన్ని మురళీకృష్ణ కొనియాడారు. భద్రాచలం కి చెందిన ప్రముఖ సామాజికవేత్త బిర్రు సుధాకర్ ఇడమయ్యకు కృత్రిమ కాలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. ఇడమయకు పింఛను మంజూరు కోసం చీమలమర్రి మురళీకృష్ణ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. పలువురు దాతలు ఇడమయ్యకు సహకరించేందుకు ముందుకు వస్తున్నారు.

# యంగ్ డైరెక్టర్లను వదలని కమల్..

మరో టాలెంట్ కు అండ! అంతే కాదు, పెద్ద హీరోతో సినిమా చేయలేకపోయినా డైరెక్టర్ ని పూర్తిగా పక్కన పెట్టకుండా అతనితో కలిసి కథను మరింత మెరుగుపరచే ప్రయత్నాలు ఇంకా కొనసాగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. తమిళ సినీ పరిశ్రమలో కొత్త టాలెంట్ ను గుర్తించి వారికి అవకాశాలు కల్పించే నటుల్లో కమల్ హాసన్ పేరు ఎప్పుడూ ముందువరుసలో ఉంటుంది. నటుడిగానే కాదు, నిర్మాతగా కూడా ఆయన తీసుకునే నిర్ణయాలు తరచుగా చర్చనీయాంశమవుతుంటాయి. తాజాగా ఒక యంగ్ డైరెక్టర్ కి ఆయన ఇస్తున్న మద్దతు ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చకు దారి తీసింది. సాధారణంగా ఒక పెద్ద స్టార్ కోసం రెడీ చేసిన కథ ఆ ప్రాజెక్టులో ముందుకు వెళ్లకపోతే, ఆ కథతో



పాటూ డైరెక్టర్ అవకాశాలు కూడా తగ్గిపోతాయని భావిస్తారు. కానీ కమల్ విధానం మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. ఒక ప్రాజెక్టు రూపంలో ఊహించిన కల నెరవేరకపోయినా, ఆ డైరెక్టర్ ఆలోచనలో విలువ ఉంటే దానిని వదిలేయకూడదన్న దృక్పథాన్ని ఆయన మరోసారి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. రీసెంట్ గా యంగ్ డైరెక్టర్ శిబి చక్రవర్తి పేరు ఈ నేపథ్యంలో వినిపిస్తోంది. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన శిబి.. కమల్ హాసన్ బ్యానర్ లో రజినీ నటించనున్న సినిమాకు దర్శకత్వం వహిస్తారని అంతా అనుకున్నారు కానీ కమల్ కు నచ్చిన కథ రజినీకి నచ్చడంతో ఆ ప్రాజెక్టు వేరే డైరెక్టర్ తో మొదలైంది. అయితే శిబి చెప్పిన ఆ కథ అందరికీ వెంటనే కనెక్ట్ కాకపోయినా, కమల్ మాత్రం ఆ కథలో ప్రత్యేకతను గుర్తించినట్లు తెలుస్తోంది. కమల్ కెరీర్‌ను పరిశీలిస్తే ఆయనకు ఎప్పుడూ కొత్త ఆలోచనలు, ప్రయోగాత్మక కథలు, సాంప్రదాయ ఫార్ములాలకు భిన్నమైన కథనాలపై ఆసక్తి ఎక్కువ. అందుకే ఒక కథలో కమర్షియల్ అంశాల కంటే కొత్తదనం, పాత్రల లోతు లేదా కథ చెప్పే విధానంలో ప్రత్యేకత కనిపిస్తే దానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో శిబి రెడీ చేసిన కథ కూడా అలాంటి కోవలోనే ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# క్యారెక్టర్ ఆర్టిస్ట్ సుధ సడెన్ గా మాయమవ్వడం వెనక కారణం?




దుల్కర్ సల్మాన్ సూపర్ హిట్ చిత్రం –లక్కీ భాస్కర్–లో సుధ ఒక చిన్న సపోర్టింగ్ రోల్‌లో చివరిసారిగా ప్రేక్షకులను పలకరించారు. టాలీవుడ్‌లో ఒకప్పుడు అగ్ర హీరోలందరికీ సోదరిగా, ఆప్యాయతను పంచే మాతృమూర్తిగా కీలకమైన పాత్రలు పోషించి మెప్పించిన సీనియర్ నటి సుధ (హేమ సుధ) గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. –క్యారెక్టర్ ఆర్టిస్ట్ అంటే సుధలా ఉండాలి!– అనేంతగా ఆమె తెలుగు ప్రేక్షకుల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారు. ప్రతి తెలుగు ఇంట్లోనూ ఇలాంటి ఒక వ్యక్తి ఉంటారని అభిమానంగా చెప్పుకునేలా సంప్రదాయబద్ధమైన పాత్రల్లో అలరించిన ఈ వెటరన్ నటి సడెన్‌గా వెండితెరపై కనిపించకుండా పోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తమిళనాడులోని శ్రీరంగంలో పుట్టి పెరిగిన సుధ, తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో దాదాపు 250కి పైగా చిత్రాల్లో నటించి బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే అకస్మాత్తుగా సినిమాల్లో కనిపించకపోవడం వెనుక ఉన్న కారణాలపై ఇటీవల సోషల్ మీడియాల్లో చర్చ సాగుతోంది. ఈ చర్చలో నెటిజన్లు ప్రధానంగా ప్రస్తావించిన అంశం క్యారెక్టర్ రోల్స్‌లో వచ్చిన మార్పులు.. సరైన కంటెంట్ లేకపోవడం ప్రధాన కారణం. కెరీర్‌లో సుధ వరుసగా ఒకే రకమైన సాఫ్ట్ మదర్ క్యారెక్టర్లు చేయడం వల్ల ప్రేక్షకుల్లో ఒక రకమైన విసుగు వచ్చిందని కొందరు అభిప్రాయపడ్డారు. దీనికి తోడు... ఒక ఇంటర్వ్యూలో తనే స్వయంగా చెప్పినట్లు.. ప్రస్తుతం వస్తున్న సినిమాల్లో సపోర్టింగ్ క్యారెక్టర్లకు సరైన ప్రాధాన్యత, ప్రాణం ఉండటం లేదు. కథల్లో అమ్మ, నాన్న పాత్రలను కేవలం నామమాత్రంగానే వాడుకుంటుండటం వల్ల.. ప్రాధాన్యత లేని పాత్రలు చేయడం ఇష్టం లేకే సినిమాలను తగ్గించుకున్నారని నెటిజన్లు గుర్తుచేశారు. పరిశ్రమలో కొత్త నటీమణుల ఎంట్రీ.. ట్రెండ్ షిఫ్ట్ కూడా సుధకు అవకాశాలు తగ్గడానికి మరో ప్రధాన కారణం. ఒకప్పుడు సుధ చేసిన తరహా పాత్రల్లోకి తులసి, రోహిణి, పవిత్ర లోకేష్, సితార, ఇంద్రజ వంటి నటీమణులు రీప్లేస్ చేసారు. వీరికి తోడు ఒకప్పటి స్టార్ హీరోయిన్లు అయిన నదియా, ఖుష్బూ, కాజోల్ వంటి వారు సరికొత్త గ్లామరస్, పవర్‌ఫుల్ లేదా మోడ్రన్ మాతృమూర్తి పాత్రల్లోకి మారి టాలీవుడ్‌లో రీఎంట్రీ ఇవ్వడంతో పాతతరం హోమ్‌మేకర్ పాత్రల సమీకరణాలు పూర్తిగా మారిపోయాయని నెటిజన్లు విశ్లేషించారు. మారుతున్న సినిమా జానర్స్ కూడా దీనికి ఒక బలమైన కారణం. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఎక్కువగా భారీ బడ్జెట్ సినిమాలు, గ్లోబల్ లెవెల్ యాక్షన్ డ్రామాలు, మాస్ మసాలా– విజువల్ ఎఫెక్ట్స్ (ఎఫీశ) ఆధారిత చిత్రాల ట్రెండ్ నడుస్తోంది. ఇలాంటి హై-వోల్టేజ్ కథల్లో పాతకాలపు ఎమోషనల్ సెంటిమెంట్‌తో కూడిన తల్లి పాత్రలకు స్కోప్ చాలా తక్కువగా ఉంటోంది. దీనికి తోడు నటి సుధకు వయసు పైబడటం.. కొన్ని వ్యక్తిగత ఆరోగ్య సమస్యల కారణంగానే ప్రస్తుతం సినిమాల నుండి కాస్త బ్రేక్ తీసుకుని.. చెన్నైలో ప్రశాంతంగా తన ఫ్యామిలీతో కాలం గడుపుతున్నారని కొందరు నెటిజన్లు వ్యాఖ్యానించారు. దుల్కర్ సల్మాన్ సూపర్ హిట్ చిత్రం –లక్కీ భాస్కర్–లో సుధ ఒక చిన్న సపోర్టింగ్ రోల్‌లో చివరిసారిగా ప్రేక్షకులను పలకరించారు.

# ఏం తింటున్నార్రా బాబూ.. టాప్ హీరోయిన్‌ల ఫిట్నెస్ సీక్రెట్స్!



గ్లామర్ రంగంలో రూపాన్ని మెయింటెయిన్ చేయడం చాలా అవసరం. ముఖ్యంగా తల్లి అయ్యాక కూడా తిరిగి హీరోయిన్ గా రాణించాలంటే.. దానికోసం కఠోరమైన శ్రమ, ప్రణాళిక తప్పనిసరి. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ సుపరిచితమైన టాప్ –10 అందగత్తెలు తమ సిల్కీ లుక్ –సన్నజాజి తీగ లాంటి శరీరాకృతిని కాపాడుకోవడానికి ఏం చేస్తున్నారో తెలుసా? వెండితెరపై తళతళా మెరిసిపోయే ఈ భామల ఫిట్‌నెస్ రహస్యాలు తెలుసుకోవాలనే ఆసక్తి మీకు ఉందా? ఉంటే పూర్తి వివరాల్లోకి వెళ్లాల్సిందే. గ్లామర్ రంగంలో రూపాన్ని మెయింటెయిన్ చేయడం చాలా అవసరం. ముఖ్యంగా తల్లి అయ్యాక కూడా తిరిగి హీరోయిన్ గా రాణించాలంటే.. దానికోసం కఠోరమైన శ్రమ, ప్రణాళిక తప్పనిసరి. భారత చలనచిత్ర పరిశ్రమలో రాణిస్తున్న టాప్ 10 హీరోయిన్ ల ఇన్‌స్టాగ్రామ్ ఫీడ్ ను పరిశీలిస్తే.. బాలీవుడ్ – సౌత్ చిత్రసీమలోని టాప్ హీరోయిన్లు కేవలం సాధారణ వర్కౌట్లతో సరిపెట్టడం లేదు. ఈ అందాల భామలు తమ రోజువారీ జీవనశైలిలో జిమ్ – పైలేట్స్ ట్రైనింగ్‌కు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని సర్వేలో తేలింది. బాలీవుడ్ టాప్ హీరోయిన్లలో దీపిక పదుకొనే, ఆలియా భట్, కత్రినా కైఫ్ తమ ఫిట్‌నెస్ క్లాసులలో పైలేట్స్‌ను ఒక ప్రధాన భాగంగా చేసుకున్నారు. పైలేట్స్ వ్యాయామాలు శరీరం ఫ్లెక్సిబిలిటీని (సమతుల్యత) పెంచడమే కాకుండా, శారీరకంగా బలాన్ని పటిష్టం చేయడానికి అద్భుతంగా తోడ్పడతాయి. ముఖ్యంగా ఆలియా భట్ గర్భధారణ తర్వాత కూడా చాలా త్వరగా తన పాత రూపానికి రావడానికి ఈ పైలేట్స్ రొటీన్ ఎంతో సహాయపడింది. ఇక కత్రినా, దీపికా కూడా మామ్స్ అన్న సంగతి తెలిసిందే. ఈ ఇద్దరూ తమ పర్‌ఫెక్ట్ బాడీ షేప్ కోసం వెయిట్ ట్రైనింగ్ – పైలేట్స్‌ను కలిపి బ్యాలెన్స్ చేస్తుంటారు. ఈ ఫిట్‌నెస్ రేసులో సీనియర్ భామలు కరీనా కపూర్ ఖాన్ – మలైకా అరోరా ఎవరికీ తీసిపోరని నిరూపిస్తున్నారు. వయసు పెరుగుతున్నా కొద్దీ మరింత అందంగా, ఫిట్‌గా తయారవ్వడం వీరికే చెల్లింది. మలైకా అరోరా తన ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా క్లిష్టమైన పైలేట్స్ , యోగాసనాలను షేర్ చేస్తూ యువతకు స్ఫూర్తినిస్తుంటుంది. అలాగే ఇద్దరు పిల్లల తల్లైన కరీనా కపూర్ కూడా జిమ్‌లో హెవీ వెయిట్ ట్రైనింగ్ .. కఠినమైన కార్డియో వర్కౌట్లను అలవోకగా చేస్తూ తన గ్లామర్‌ను కాపాడుకుంటోంది. సౌత్ స్టార్ సమంత రూత్ ప్రభు ఫిట్‌నెస్ సెషన్స్‌లో పైలేట్స్ చాలా కీలకమైనది. మయోసైటిస్ సహా కొన్నిరకాల శారీరక సవాళ్లను ఎదుర్కొన్నా సామ్ జిమ్‌లో కఠినంగా శ్రమిస్తూ, గ్రేట్ కంబ్యాక్ ఎలా ఉంటుందో చూపించారు. సమంత వెయిట్ లిఫ్టింగ్, క్యాలిస్టెనిక్స్, పైలేట్స్ సెషన్ల వీడియోలు సోషల్ మీడియాలో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటాయి. తనలాగే నేటి తరం యంగ్ హీరోయిన్లలో జాన్వీ కపూర్, ఆలయ ఎఫ్ వంటి వారు కూడా ఈ తరహా కఠినమైన శిక్షణనే నమ్ముకున్నారు. జాన్వీ కపూర్ తన కర్వీ ఫిగర్‌ను నిలబెట్టుకోవడానికి జిమ్ వర్కౌట్లతో పాటు రెగ్యులర్‌గా పైలేట్స్ స్టూడియోల చుట్టూ తిరుగుతూ కనిపిస్తుంది. ఈ పదిమంది స్టార్ హీరోయిన్ల ఫిట్‌నెస్ సీక్రెట్ కేవలం డైటింగ్ మాత్రమే కాదు...క్రమం తప్పని శారీరక శ్రమ. వెయిట్ ట్రైనింగ్ ద్వారా కండరాల బలాన్ని పెంచుకుంటూనే... పైలేట్స్ ద్వారా తమ శరీరాన్ని సన్నజాజి తీగలా మలుచుకుంటున్నారు. ఎప్పటికప్పుడు సరికొత్త వర్కౌట్ ట్రెండ్స్‌ను ఫాలో అవుతూ.. తమ బాడీని టోన్డ్ గా ఉంచుకోవడమే ఈ గ్లామర్ క్వీన్స్ అసలైన మంత్రం. అందుకే వీరంతా వెండితెరపైనే కాకుండా.. సోషల్ మీడియాలోనూ మిలియన్ల మందికి ఫిట్‌నెస్ ఐకాన్స్‌గా నిలుస్తున్నారు.

# 2027 ప్రభాస్ నామ సంవత్సరం..!



ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్ హీరోగా ఇప్పుడు పలు సెన్సేషనల్ ప్రాజెక్ట్ లు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది రాజా సాబ్ తో వచ్చారు కానీ ఇది డిజప్పాయింట్మెంట్ ని మిగిల్చింది. ఇక ఈ సినిమా తర్వాత ఈ ఏడాది లోనే దర్శకుడు హను రాఘవపూడితో చేస్తున్న సినిమా "ఫౌజీ" కూడా విడుదల కావాల్సి ఉంది కాని వాయిదా పడినట్లు తెలుస్తోంది. అయితే అది కూడా 2027 కే అని కూడా టాక్.సో దీనితో 2027లో మాత్రం ప్రభాస్ అభిమానులుకి ఒకటి కాదు మొత్తం మూడు ట్రీట్ లు ఉంటాయని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగాతో చేస్తున్న స్పిరిట్ అలాగే బాహుబలి యానిమేషన్ సినిమా బాహుబలి ది ఎటర్నల్ వార్ కూడా ఈ 2027 లోనే విడుదల కానున్నాయి. సో 2027 మాత్రం ప్రభాస్ నామ సంవత్సరం అనే చెప్పి తీరాలి. ఇక ఈ సినిమాలు బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ ని నమోదు చేస్తాయో చూడాలి.

# విజయ్ బర్త్ డే రోజున కూడా కానరాని 'జన నాయగన్'..!

తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూసిన 'జన నాయగన్' సినిమా అప్‌డేట్ రాకపోవడంతో నిరాశే ఎదురైంది. కనీసం బర్త్‌డే ట్రీట్‌గా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ లేదా ఒక కొత్త పోస్టర్ అయినా వస్తుందని




ఆశించిన ఫ్యాన్స్‌కు ప్రొడక్షన్ హౌస్ నుండి పూర్తి సైలెన్స్ మిగిలింది. నిజానికి ఎన్నికల తర్వాత కూడా విజయ్ ఈ చిత్ర నిర్మాతలతో సన్నిహితంగానే ఉంటున్నాడు. అయితే, ప్రజలు తనను ఒక సీరియస్, పూర్తి స్థాయి రాజకీయ నాయకుడిగా మాత్రమే చూడాలని ఆయన భావిస్తున్నాడు. అందుకే సీఎం అయినప్పటి నుండి తన రాజకీయ పరిపాలనలోకి ఎక్కడా సినిమా చర్చలు రాకుండా విజయ్ పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. కారణాల వల్లే 'జన నాయగన్' చిత్రానికి సంబంధించిన ఎలాంటి సినిమా ఈవెంట్స్ లేదా ప్రమోషన్స్ జరగడం లేదు. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ ఖచ్చితంగా థియేటర్లలోకి వస్తుందనడంలో సందేహం లేనప్పటికీ.. ఇది వెండితెరపై విడుదల కావడానికి మరికొంత సమయం పట్టేలా కనిపిస్తోంది.

# అప్పటి డేరింగ్ డెసిషన్ ఇప్పటికీ వెంటాడుతుందా?



ఒకప్పుడు టాలీవుడ్ హీరోలతో వరుస విజయాలు అందుకుని స్టార్ హీరోయిన్ గా వెలుగొందిన అనుష్క శెట్టి కోసం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఒకప్పుడు టాలీవుడ్ హీరోలతో వరుస విజయాలు అందుకుని స్టార్ హీరోయిన్ గా వెలుగొందిన అనుష్క శెట్టి కోసం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. కెరీర్ లో తీసుకున్న ఒక డేరింగ్ డెసిషన్ ఇప్పటికీ ఆమె సినీ జర్నీపై ఎఫెక్ట్ చూపుతోందా అనే చర్చ వినిపిస్తోంది. ముఖ్యంగా ఇటీవల ఆమె సినిమాల సెలక్షన్, ల్యాంగ్ గ్యాప్ లు, కొత్త ప్రాజెక్టులపై క్లారిటీ లేకపోవడం అభిమానులను ఆలోచనలో పడేస్తోంది. అనుష్క ఇండస్ట్రీలోకి రాకముందు యోగా ట్రైనర్ గా వర్క్ చేసిన విషయం తెలిసిందే. బెంగళూరులో చదువుకున్న ఆమె ఫేమస్ యోగా టీజర్ భరత్ ఠాకూర్ వద్ద ట్రైనింగ్ తీసుకున్నారు. నటిగా మారాలనే ఆలోచన లేకుండానే జీవితం సాగుతున్న సమయంలో దర్శకుల దృష్టిలో పడిన ఆమె, 2005లో విడుదలైన సూపర్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరమే రాలేదని చెప్పాలి. విక్రమార్కుడు, అరుంధతి, భాగమతి వంటి చిత్రాలతో నటిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనుష్క, కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ స్టోరీస్ తో కూడిన చిత్రాల్లోనూ తనదైన క్రేజ్ సంపాదించుకున్నారు. ముఖ్యంగా బాహుబలి సిరీస్ లో దేవసేన రోల్ ఆమెకు పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు తీసుకొచ్చింది. ఒక జెనరేషన్ ఆడియన్స్ కు ఆమె జేజమ్మ, దేవసేనగా గుర్తుండిపోయారు. అయితే ఆమె కెరీర్ లో టర్నింగ్ పాయింట్ గా నిలిచిన చిత్రం సైజ్ జీరో. ఆ సినిమాలో రోల్ కోసం అనుష్క బాగా బరువు పెరగడం అప్పట్లో అందరి ప్రశంసలు అందుకుంది. పాత్ర కోసం అంతటి డెడికేషన్ చూపించడం ఆమె ప్రొఫెషనలిజానికి ఎగ్జాంపుల్ గా నిలిచింది. కానీ అదే నిర్ణయం తర్వాత ఆమె కెరీర్ పై ప్రభావం చూపిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. బరువు తగ్గేందుకు ప్రయత్నించినప్పటికీ గతంలో ఉన్న ఫిట్ నెస్ ను పూర్తిగా తిరిగి పొందలేకపోయారనే చర్చ సాగుతోంది. ఇటీవలి కాలంలో అనుష్క సినిమాల మధ్య గ్యాప్ కూడా పెరిగింది. రెండు, మూడు సంవత్సరాలకు ఒక సినిమా మాత్రమే చేస్తుండటంతో ఆమె అభిమానులు నిరాశ చెందుతున్నారు. గత ఏడాది విడుదలైన ఘాటిపై భారీ అంచనాలు నెలకొన్నప్పటికీ ఆ చిత్రం ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఆమె తదుపరి ప్రాజెక్టులపై మరింత ఆసక్తి నెలకొంది.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555